# జీవితేచ్ఛ



ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం రోగులతో సందడిగా వుంది. డాక్టర్‌తో పరీక్ష చేయించు కోటానికి రోగులు గది ముందు క్యూకట్టి నిలుచున్నారు. చిన్నా, చితకా రోగాలతో కాలక్షేపంగా అక్కడకు వచ్చిన రోగులు కొందరికి రోగ బాధ కన్నా నిరీక్షణే భరించరాని బాధయినట్లు ముఖాల్లో అసహనం తొంగి చూస్తున్నది. ఎంత

త్వరగా డాక్టర్‌కి చూపించుకొని బయట పడదామా అన్న ఆత్రంతో కుదురుగా నిలబడలేక, నిజంగా రోగ బాధలతో వున్న వాళ్లను ముందుకీ వెనక్కీ నెడ్తూ ఇబ్బందికి గురి చేస్తున్నారు. దానితో వాళ్లు కుయ్యోమొర్రోమని మొత్తుకుంటుంటే చూడ్లేక తోటి గావు కేకలు పెడ్తున్నది.

"ఏందా నెట్టుకోటం; సరిగా నిలబడండి. డాక్టర్‌గారు అందర్నీ చూసే పంపిస్తార్లే" అంటూ గుడ్లురుముతున్నది.

ఆ ప్రక్కనే వున్న ఐ.సి.టి.సి సెంటర్ ముందు మాత్రం నింపాదిగ నలుగురైదుగురు గర్భిణులు బల్ల మీద కూచుని తోడుగా వచ్చిన వాళ్లతో కబుర్లాడుతున్నారు. మరో ప్రక్కన, శనివారం వాక్సిన్ డే కావటంతో, పోలియో డ్రాప్స్‌తోపాటు, బి.సి.జి ఇంజక్షన్లు చేస్తుంటే ఉండుండి పిల్లలు గుక్కబట్టి ఏడుస్తున్నారు. ఓ.పీ. చీటిలు తెచ్చి మందుల కోసం గుంపుగా ఎగబడ్తున్న రోగుల్ని, వరుసలో నిలబడమని ఫార్మాసిస్ట్ విసుక్కుంటున్నది.

"దుర్గా! నర్సుగారు నిన్ను పిలుస్తున్నారు" కేకేసింది యం.పి.హెచ్. ఫిమేల్ అసిస్టెంట్ కుమారి.

బల్లమీద కూర్చుని తల్లితో ముచ్చట్లాడుతున్న దుర్గ మెల్లగా లేచింది. ఐ.సి.టి.సి సెంటర్లోకి తల్లి కాంతమ్మతో పాటు అడుగుపెట్టింది.

కుర్చీలో కూర్చోమంటూ సైగచేసి, బ్లడ్ రిపోర్ట్‌లోకి, దుర్గ ముఖంలోకి ఎగాదిగా నాలుగైదు సార్లు చూచింది నర్స్ ప్రాక్టీషనర్ కమల. "నీ రక్తంలో తేడా వుందమ్మా!" అన్నది.

"తేడానా! పిల్లకేనన్నా ఇబ్బందామ్మా!" కాంతమ్మ ముఖంలో కాస్తంత ఆందోళన తొంగి చూచింది.

కాంతమ్మ మాటలు వినిపించుకోనట్లే బ్లడ్ రిపోర్ట్ కుమారి చేతిలో పెడ్తూ "ఈ పిల్లను పెద్ద డాక్టర్‌గారి దగ్గరకు తీసుకెళ్లు" అంటూ చెప్పింది కమల.

బ్లడ్ రిపోర్ట్ చూస్తూనే డాక్టర్ శరత్ భ్రుకుటి ముడి పడింది.

"ఏమ్మా! పెళ్లయి ఎన్నేళ్ళయింది?"

"మూడేళ్లండి" చెప్పింది దుర్గ.

"ఇది ఎన్నో కాన్పు?"

"మొదటిదేనండి" చెప్పింది కాంతమ్మ.

"మీ అత్తగారి దేవూరు?"

"కొర్నూతలండి."

"మీ ఆయనేం చేస్తుంటాడు?"

"ప్రత్తిమిల్లులో మెకానిక్‌గా పని చేస్తున్నాడండి."

" మీ ఆయన కూడా రక్త పరీక్ష చేయించుకోవాలి. రమ్మని కబురు పెట్టండి" చెప్పాడు డాక్టర్ శరత్.

" అబ్బాయికి రక్త పరీక్ష దేనికండీ?" అనుమానంగా అడిగింది కాంతమ్మ.

రక్తపరీక్ష దేని నిమిత్తం చేయాల్సివస్తున్నదో చెప్పి వాళ్లను కంగారు పెట్టటం ఇష్టంలేకపోయింది. పరీక్షలో నిర్ధారణ అయ్యాకనే అసలు విషయం చెప్పటం మంచిదని పించింది.

"ఏం లేదమ్మా! అమ్మాయికి మొదటి కాన్పుకదా! ఆపరేషన్ చేయాల్సిన అవసరం గనుక వస్తే అమ్మాయికి రక్తం కావాల్సి రావచ్చు. ఇద్దరిదీ ఒకే గ్రూపు అయివుంటే అబ్బాయి రక్తమే ఇవ్వొచ్చు. ఈ రోజుల్లో ఎవరిది పడితే వాళ్లది రక్తం తీసుకోవటం అంత మంచిది కాదు" వాస్తవం దాచి మరోలా చెప్పాడు డాక్టర్ శరత్.

దుర్గకు ఆసుపత్రిలో యాంటీనేటల్ వైద్య పరీక్షలన్నీ పూర్తి చేసి, టెటనస్ ఇంజక్షన్ చేసి, బలానికి ఐరన్, ఫోలిక్ యాసిడ్ మాత్రలు ఇచ్చారు. శిశువు ఎదుగుదలకు, ఆరోగ్య పరిరక్షణకు తగిన పోషకాహారాన్ని ఎలా తీసుకోవాలో జాగ్రత్తలు చెప్పి పంపించారు వైద్య సిబ్బంది.

అల్లుణ్ణి ఒకసారి వచ్చి పొమ్మని తెలిసిన వాళ్ల ద్వారా కబురు పెట్టారు. భార్యను ప్రేమగా అంటి పెట్టుకు తిరిగే నాసరయ్యకు ఒంటరితనం ఇబ్బందిగానే వుంది. కబురందుకుంటూనే డ్యూటీకి రెండ్రోజులు సెలవు పెట్టి వచ్చాడు.

దుర్గ రావాల్సిన పనేం లేదని చెప్పటంతో, పిచ్చయ్య తనే అల్లుణ్ణి ఆసుపత్రికి వెంటబెట్టుకుని తీసుకెళ్లాడు.

ముందుగా రక్తం శాంపిల్ తీసుకొని 3 డి బయోలైన్ టెస్ట్ చేశారు. పాజిటివ్ వచ్చింది. హెచ్.ఐ.వి.గా నిర్ధారణ చేయటానికి అవసరమైన మరో రెండు పరీక్షలు కాంబి ఎయిడ్స్, ట్రైలైన్ హెచ్.ఐ.వి. కూడా చేశారు. పాజిటివ్ రావటంతో హెచ్.ఐ.వి.గా నిర్ధారించి రిపోర్టు రాసి డాక్టర్ దగ్గరకు పంపింది కమల.

"ఏం చదువుకున్నావయ్యా?" అడిగాడు డాక్టర్ శరత్ రిపోర్టు చూస్తూనే.

"ఐ.ఐ.టి. చదివా సార్!"

"ఏం ఉద్యోగం చేస్తున్నావు?"

"ప్రత్తి మిల్లులో మెకానిక్ నండీ!"

"సిగరెట్లు, జర్దాలు, పాన్‌పరాగ్‌లు అలవాటుందా?"

"లేదు."

"మందు కొడతావా?"

ఆ ప్రశ్నకు కాస్త తడబడ్డాడు. నిజం చెప్పటానికి ఇబ్బందనిపించినా అబద్ధం చెప్పలేకపోయాడు.

"ఎప్పుడన్నా.....సర్దాగా.... పెళ్లిళ్లకీ, పండగలకీ....కొద్దిగా స్నేహితులతో...."

"అంతవరకేనా, సరదాగా ఆడస్నేహాలు, తిరుగుళ్లూ కూడానా?" డాక్టర్ ప్రశ్నలకు నాసరయ్య బెదిరి పొయ్యాడు.

"అట్టా చెడు తిరుగుళ్లు తిరగనండీ!"

"వందశాతం నిజమేనా?" నిలదీసి అడిగాడు డాక్టర్ శరత్.

నాసరయ్య అవునన్నట్లు తలూపాడు. అయితే ఎక్కడో మనసులో చిన్న అపరాధభావం తొంగిచూస్తూ మెదడ్ని తొలచసాగింది.

"గతంలో నీకేదైనా ఆపరేషన్ చెయ్యటంగాని, రక్తం ఎక్కించడం గాని జరిగిందా?"

"లేదండీ!" టక్కున సమాధానం చెప్పాడు. ఐతే డాక్టర్ వేస్తున్న ప్రశ్నలకు కొద్దిగా భయం మొదలైంది.

"సార్! ఇవన్నీ ఎందుకడుగుతున్నారు?" బెరుగ్గా ప్రశ్నించాడు.

"ఈ రిపోర్టుని బట్టే అడగాల్సి వచ్చిందయ్యా! హెచ్.ఐ.వి. అంటే తెలుసా?"

"బాగా తెలీదండి!"

"హ్యూమన్ ఇమ్యునో డెఫిషీయన్సీ వైరస్. ఇది కంటికి కనిపించని ఒక సూక్ష్మాతి సూక్ష్మమైన క్రిమి. మనిషిలోని వ్యాధి నిరోధక శక్తిని క్షీణింపజేసే క్రిమి అన్నమాట. దీనినే ఎయిడ్స్ వైరస్ అని కూడా అంటారు."

ఎయిడ్స్ అన్నమాట వినగానే నాసరయ్య ముఖంలో ఆందోళన తొంగి చూచింది. తరచూ ప్రచార సాధనాల ద్వారా వినటం ద్వారా ఎయిడ్స్ అనేది ఒక ప్రాణాంతక వ్యాధని మాత్రం తెలుసుకోగలిగాడు.

"ఎయిడ్స్ అనేది ఒక ప్రాణాంతకమైన రోగమని తెలుసండీ!" మెల్లగా చెప్పాడు.

"హెచ్.ఐ.వి వైరస్ వల్ల శరీరం వ్యాధులతో పోరాడే శక్తిని కోల్పోయి వ్యాధుల బారిన పడే చివరి దశ ఎయిడ్స్. ఈ వ్యాధికి నివారణ తప్ప మందు లేదు. ఎలా వస్తుందో తెలుసా?" అడిగాడు డాక్టర్ శరత్.

"బాగా తెలీదండి!" నసిగాడు నాసరయ్య.

"చెప్తా విను. ముఖ్యంగా నాలుగు రకాలుగా ఈ వ్యాధి వ్యాపిస్తుంది. ఒకటి హెచ్.ఐ.వి సోకిన స్త్రీ, పురుషులతో లైంగిక సంబంధాల వలన, రెండు హెచ్.ఐ.వి తో కలుషితమైన రక్తాన్ని సేకరించి ఆరోగ్యవంతునికి ఎక్కించడం వలన, మూడు హెచ్.ఐ.వి సోకిన వారికి వాడిన సూదులు, సిరంజిలు ఆరోగ్యవంతునికి వాడితే, నాలుగు హెచ్.ఐ.వి సోకిన స్త్రీ గర్భం దాలిస్తే ఆ తల్లి నుండి పుట్టబోయే బిడ్డకు ఈ వ్యాధి సంక్రమిస్తుంది. పై మూడు రకాల్లో ఏ విధంగా నీకీ వ్యాధి వచ్చిందో తెలుసుకోవటానికి అడుగుతున్నాను. నీ రక్తంలో హెచ్.ఐ.వి. వైరస్ కనిపించింది" తేల్చి చెప్పాడు డాక్టర్.

డాక్టర్ మాటలకు నాసరయ్య వెన్నులోంచి చలిపుట్టినట్లయింది. తన రక్తంలో ఎయిడ్స్ క్రిమి వుందన్న నిజాన్ని నమ్మలేకపోతున్నాడు. తనకు ఎలాంటి అనారోగ్యం లేదు. తింటున్నాడు. తిరుగుతున్నాడు. పని చేసుకోగలుగుతున్నాడు. ఆ ప్రశ్నే డాక్టర్ని అడిగాడు.

"నీ సందేహం సరైందే. నెల రోజుల్లో శరీరం బరువులో పది శాతం తగ్గడం, నెల రోజులకు మించి జ్వరం, విరోచనాలు ఎయిడ్స్ వ్యాధి ముఖ్య లక్షణాలు. అయితే వ్యాధి ముదిరాక కనబడే ఈ లక్షణాలు తొలిదశలో కనబడవు. రక్త పరీక్షలో మాత్రమే వైరస్ కనిపిస్తుంది. వైరస్ శరీరంలో ప్రవేశించాక ఎయిడ్స్ దశకు చేరుకోవడానికి 7-10 సంవత్సరాల కాలం పట్టొచ్చు. ఇప్పటికిప్పుడు నీ కొచ్చిన ప్రమాదం ఏంలేదు. ఇంతకీ ఎవరో పరాయి స్త్రీ తో లైంగిక సంబంధం వలన నీకీ వ్యాధి వచ్చుండాలి. అవునా?" సూటిగా అడిగాడు శరత్.

నాసరయ్య బిక్కచచ్చిపొయ్యాడు. "లే...లేదండి...నాకు..నేను అలాంటి చెడు తిరుగుళ్లు తిరగనండీ" మాటలు తడబడుతున్నాయి.

"పరాయి స్త్రీలతో నీకెలాంటి సంబంధాలు లేనప్పుడు, నీ భార్య ద్వారా మాత్రమే నీకావ్యాధి సంక్రమించే అవకాశం వుంది. అంటే నీ భార్య ప్రవర్తన....."

" లేదండీ! దుర్గ చాలా మంచిది. అలాంటి తప్పు చెయ్యదు. దుర్గంటే నాకు ప్రాణమండీ" భార్య ప్రసక్తి రావటంతో ఆవేశానికి లోనయ్యాడు నాసరయ్య.

"అంటే నీ చెడు ప్రవర్తన కారణంగానే నీ భార్యకు కూడా హెచ్.ఐ.వి. సంక్రమించింది. అవునా?" సూటిగా అడిగాడు డాక్టర్ శరత్.

డాక్టర్ ప్రశ్నకు ఉలిక్కిపడ్డాడు నాసరయ్య. అతని నవనాడులు కృంగినట్లయింది. మనిషి ఒక్కసారిగా డీలా పడిపోయాడు.

"దుర్గకు కూడా ఎయిడ్సా! నిజమా!.....నేను చేసిన తప్పుకు నాకు శిక్ష పడాలి. దుర్గ అమాయకురాలు. తన కెలాంటి ప్రాణాపాయం రాకూడదు" ఏడ్చేస్తున్నాడు నాసరయ్య.

"నువ్వు నిజం దాచి పెట్టినా, రక్త పరీక్ష ఆ నిజాన్ని వెల్లడిస్తుంది. క్షణికోద్రేకంలో చేసే తప్పులే మనిషి పతనానికి కారణమవుతాయి."

డాక్టర్ మాటలకు నాసరయ్య మరింత కృంగిపోయాడు. ఒక స్నేహితుడి ప్రోద్బలంతో పెళ్లికి ముందు చేసిన చీకటి తప్పు ఇలా తమ జీవితాల్ని బలి తీసుకుంటుందనుకోలేదు. కామంతో నిగ్రహం కోల్పోయి, సహవాస దోషంతో తప్పుదారి పట్టాడు. అతని మాటల గారడీకి బోల్తా పడ్డాడు. ఆకలి లాగానే సెక్స్ కూడా శారీరక అవసరమన్నాడు. కడుపుకి ఆకలి వేస్తే హోటళ్లల్లో కొనుక్కొని తింటున్నట్టే, సెక్స్ అనుభవం కూడా డబ్బుతో కొనవచ్చన్నాడు. పెళ్లికి ముందు కనీసానుభవం లేకుంటే భార్య దగ్గర చులకనవుతామని రెచ్చగొట్టాడు. అజ్ఞానంతో అగాధంలోకి పడిపొయ్యాడు తను.

"తప్పు చేశాను సార్. దానికి ఇంత పెద్ద శిక్ష పడుతుందను కోలేదు. ఇక నా దుర్గకు ఎలా ముఖం చూపించేది. చావు తప్పితే నాకు మరో దారి లేదు" ఏడుస్తున్నాడు నాసరయ్య పిల్లాడిలా.

"చూడు. తక్షణం మీ ప్రాణాలకు వచ్చే ముప్పేం లేదు. మంచి పోషకాహారం, వ్యాయామం, మానసిక ప్రశాంతత, తగిన విశ్రాంతి వంటి జాగ్రత్తలు పాటించి మీ జీవిత కాలాన్ని ఎంతో పొడిగించుకోవచ్చు" ధైర్యం చెప్పాడు డాక్టర్.

"సార్! ఎయిడ్స్ రోగిగా అవమానాలు భరిస్తూ బతికేకంటే, ఒకేసారి చావటం మేలు" నాసరయ్య మాటల్లో నిరాశ.

"నాసరయ్యా! ఎలాంటి పరిస్థితుల్లోనూ మనిషి జీవితేచ్ఛను కోల్పోకూడదు. చివరి క్షణం వరకూ ఆత్మస్థైర్యంతో పోరాడాలి. బ్రతకాలి. జీవితానికి నిన్న గురించిన

ఆత్మ విమర్శ, నేటి గురించిన విశ్వాసం, రేపటి గురించి చింతన వుండాలి. నీ కారణంగా వ్యాధి బారిన పడిన నీ భార్య గురించి ముందు ఆలోచించు" చాలాసేపు ఓపికగా కౌన్సిలింగ్ ఇచ్చాడు డాక్టర్ శరత్.

"ఏవయ్యా! మంచి పనోడివి, బుద్ధిమంతుడవని నమ్మి బంగారంలాంటి పిల్లను నీ చేతిలో పెట్టాం. చివరికిట్టా దాని పేణాల మీదకు తెచ్చి మా చేతికి అప్పగిస్తావనుకోలేదు" అంటూ పిచ్చయ్య కళ్లనీళ్ల పర్యంతమయ్యాడు.

మామ నిష్ఠూరాలకు తగిన సమాధానం చెప్పగలిగే స్థితిలో నాసరయ్య లేడు. ఊహించని ఈ పరిణామానికి అతడి మెదడు బండబారినట్లయింది. దిక్కుతోచని స్థితిలో బస్‌స్టాండు దారి పట్టాడు.

◆ ◆ ◆

నాసరయ్య చెప్పాపెట్టకుండా వెళ్లటం, రెండు వారాలైనా తనను చూసేందుకు రాకపోవటం దుర్గను కలవరపెట్టింది. ఏ విషయం గురించైనా తన వాళ్లతో గొడవ పడ్డాడా అన్న అనుమానం మొలకెత్తింది. మరో ప్రక్క ఇంట్లో వాళ్ల ప్రవర్తనా అనుమానాస్పదంగా వుంది. ఏదో ముభావంగా విచారంగా మెలగటం ఎందుకో అర్థంగాకుండా వుంది.

దుర్గను పరీక్ష చేయించటానికి ఆసుపత్రికి తీసుకెళ్లింది కాంతమ్మ. చావు కబురు చల్లగా చెప్పినట్టుగా కమల దుర్గకు హెచ్.ఐ.వి. బారిన పడిన విషయం చెప్పింది. ఆ మాటలు వింటూనే దుర్గకు భయంతో స్పృహ తప్పినట్లయింది. కాసేపటికి తేరుకొంది. కుమిలి కుమిలి ఏడ్వసాగింది.

"చూడమ్మా! శిశువు గర్భంలో వున్నప్పుడు, ప్రసవించే సమయంలో, రొమ్ముపాలు తాగటం వల్ల ఈ వ్యాధి నీ నుంచి పుట్టబోయే బిడ్డకు కూడా సంక్రమించే అవకాశం వుంది. కాబట్టి బిడ్డ వద్దనుకొంటే గర్భస్రావం చేస్తాం. లేదూ బిడ్డను కనాలంటే పుట్టబోయే బిడ్డకు నీ నుంచి వ్యాధి సోకకుండా కాపాడే అవకాశం వుంది. బిడ్డను కోరుకోవటం గాని, కాదనుకోవటంగాని నీ ఇష్టం" వివరించి చెప్పాడు డాక్టర్ శరత్.

"డాక్టర్ గారూ! నా నుంచి నా బిడ్డకు రోగం రాకుండా కాపాడండి. చచ్చేలోగా నా బిడ్డచేత 'అమ్మా' అని పిలిపించుకోవాలన్న నా కోరిక తీరితే చాలు" అంటూ చేతులు జోడించింది దుర్గ.

"మరీ అంత నిరుత్సాహ పడకమ్మా! నీ బిడ్డకు వ్యాధి రాకుండా మా శాయశక్తుల ప్రయత్నిస్తాం. నీ బిడ్డ మీద నీకుండే ప్రేమానురాగాలు నీకు బ్రతకాలన్న కోరికను పెంచొచ్చు. ఆ బిడ్డ కోసం ఇంకా ఇంకా జీవించాలనే ఆశే నిన్ను దీర్ఘాయుష్మంతురాల్ని చెయ్యొచ్చు" అంటూ దుర్గకు ధైర్యం నూరిపోసింది ఎయిడ్స్ కౌన్సిలర్ కమల.

డాక్టర్‌తోపాటు ఆసుపత్రి సిబ్బంది కూడా దుర్గపట్ల సానుభూతితో స్పందించారు. దుర్గ ఆరోగ్యం గురించి తరచూ పరీక్షలు చేస్తూ, అవసరమైన మందులిచ్చారు. పోషకాహారం కోసం డబ్బిచ్చారు. తొమ్మిదో నెల నిండేదాకా చేయాల్సిందంతా చేశారు. రోజులు లెక్కించి ప్రసనానికి ఆసుపత్రికే వచ్చి చేరమన్నారు.

దుర్గకు నొప్పులు ప్రారంభం కాగానే ఒక డోస్  నెవరఫైన్ మాత్రలు ఇచ్చారు. మొదటి నుండి డాక్టర్ సూచనలు, తగు జాగ్రత్తలు పాటించటం, మంచి పోషకాహారం తీసుకోవటం వల్ల దుర్గకు కాన్పు పెద్ద కష్టం కాలేదు. ఆరోగ్యంగా, తగిన బరువుతో, ఆడపిల్ల పుట్టింది. ఆ శిశువుకు హెచ్.ఐ.వి. సోకకుండా, కొద్ది గంటల్లో, ఒక డోస్ నెవరఫైన్ సిరప్ ఇచ్చారు. ఆరు వారాల తర్వాత గాని శిశువుకు హెచ్.ఐ.వి. సోకిందో, లేదో పరీక్షించటానికి వీల్లేదు.

నాసరయ్యకు రక్త పరీక్షలో రోగం బయటపడినప్పటి నుండి తిరిగి దుర్గను కలుసుకునే సాహసం చెయ్యలేక పోయాడు. పశ్చాత్తాపంతో కుమిలిపోని రోజంటూ లేదు. పనంటే నిరాసక్తత ఏర్పడింది. పై వాళ్లతో చివాట్లు తింటున్నాడు.

జీతంలో కోత పడుతోంది. ఎవరి కోసం బ్రతకాలన్నది ప్రశ్నయింది?

దుర్గ ప్రసవించిందని, ఆడపిల్ల పుట్టిందని నాసరయ్యకు తెలిసింది. ఒక్కసారి కన్నబిడ్డను చూడాలన్న కోరిక మొదలైంది. తన కారణంగా దుర్గకు జరిగిన అన్యాయాన్ని ఎటూ పూడ్చలేడు. కనీసం క్షమాపణ చెప్పే ధైర్యం లేకపోయింది. వెళ్తే తనకు ఛీత్కారాలు ఎదురు కావచ్చనుకొన్నాడు. ఏమైతేనేం, అన్నీ భరించటానికి సిద్ధపడ్డాడు. భార్యాబిడ్డల్ని ఒక్కసారి చూడగలిగితే చాలనుకొని గుండెదిటవు చేసుకొని ఆసుపత్రికెళ్లాడు.

అదృష్టం కొద్దీ, నాసరయ్య వెళ్లిన సమయంలో కాంతమ్మ ఒక్కతే దుర్గకు సాయంగా వుంది. అల్లుణ్ణి చూస్తూనే దుఃఖం దిగమింగి బయటకు తప్పుకొంది. నోటితో లొట్టలేస్తూ తనకేసి గుడ్లప్పగించి చూస్తున్న బిడ్డను చూస్తూ కొద్దిక్షణాలు ఆనందంతో మైమరచిపొయ్యాడు. దుఃఖంతో బెక్కుతూ ఏడుస్తున్న దుర్గ కంటబడుతూనే నాసరయ్యకు గుండె చెదిరినట్లయింది.

"మేం ఇంకా బతికుండామా లేదా అని చూడనొచ్చావా?" అంటూ గొల్లుమంది దుర్గ.

"దుర్గా! పెళ్లికి ముందు, వయసువేడిలో ఒక్కసారి చేసిన తప్పు ఇలా మన ప్రాణాల మీదికి తెస్తుందనుకోలేదు" నాసరయ్య కళ్ల నుండి నీరు పొంగుతోంది.

"మొగుడు తప్ప వేరే లోకం లేదని అమాయకంగా నమ్మే నాలాంటి తెలివి తక్కువ పెళ్లాలకు మీలాంటి మొగుళ్లు గొప్ప గొప్ప బహుమానాలు ఇస్తున్నారు."

"బతికుండగా నా ముఖం చూపించ కూడదనుకున్నాను. కాని నిన్నూ, బిడ్డను ఒక్కసారి చూడాలనిపించింది. క్షమించమని అడగటాకి నోరు రావటంలేదు" తలొంచుకొన్నాడు అపరాధిలా.

"ఏ క్యాన్సరో వచ్చిందని తెలిస్తే నలుగురూ అయ్యో! పాపమని సానుభూతి చూపిస్తారు. కాని ఈ మాయదారి రోగం సోకిందని తెలిస్తే ఈసడిస్తారు. సానుభూతికి, గుర్తింపుకు నోచని దిక్కుమాలిన చావును ఈ లోకంలో ఎవరు కోరుకుంటారు?" దుర్గ మాటలు సర్రున బాణాల్లా దూసుకొచ్చి మనసులో నాటుకొంటుంటే నాసరయ్య విలవిల్లాడిపోసాగాడు.

"కొన్ని తప్పులు సరిదిద్దుకోగలం; సర్దుకుపోగలం. ఇదట్టాంటిది కాదు. ఇకపై నీ చావు నీది, నా చావు నాది. పో ఇక" అయిష్టంగా ముఖం ప్రక్కకు తిప్పుకొంది దుర్గ.

"దుర్గా! నేను బతికున్నంత కాలం, మన బిడ్డ బాగు కోసరం చెయ్యగలిగినంత చేస్తాను. బిడ్డే లోకమనుకొంటూ చావుతో పోరాడతాను" అంటూ బిడ్డ మీదకు వంగి, ముని వేళ్లతో బుగ్గలు పుణికి, పెదాలకంటించుకున్నాడు.

అంతలో బయటినుండి సుడిగాలిలా బామ్మర్ది సూర్యం దూసుకొచ్చాడు. "రేయ్! సన్నాసోడా! పోరా బయటకు. రాటానికి సిగ్గూ, శెరం లేదంట్రా నీకు" అంటూ బావను చొక్కా కాలరు పట్టుకొని బయటకు నెట్టుకెళ్లాడు.

బయట అన్న భర్తను నోటి కొచ్చినట్లు తిడ్తున్న తిట్లు చెవినబడి దుర్గకు దుఃఖం ఆగలేదు.

◆ ◆ ◆

మూడేళ్లు ఇట్టే గడిచాయి. దుర్గ కూతురు ఎలాంటి అనారోగ్యం లేకుండా, ముద్దుగా బొద్దుగా తయారైంది. గంగని పేరు పెట్టుకొంది. గంగకు 18 నెలలు

నిండాక ఏ.ఆర్.టి. కేంద్రంలో పరీక్షలు చేశారు. ఏ దోషం బిడ్డలో కనిపించలేదు. వైద్యుల సూచనల మేరకు వ్యాయామం, మంచి పోషకాహారం తీసుకొంటూ దుర్గ ఆరోగ్యం కాపాడుకొంటోంది. తామిద్దరి పోషణకు కుటుంబం మీద ఆధారపడటం ఇష్టంలేక పోయింది. ఒక స్వచ్ఛంద సంస్థ సహాయంతో కుట్టుమిషను సంపాదించగల్గింది. బట్టలు కుట్టటం వలన వచ్చే ఆదాయంలోంచి ఇంటి ఖర్చుల క్రింద కొంత డబ్బు వాడటం మొదలెట్టింది. తల్లిదండ్రులు ముందు వారించినా క్రమంగా సూర్యం వైఖరిలో వస్తున్న మార్పు గమనించి కానీలెమ్మని ఊరుకోక తప్పలేదు.

నాలుగో యేడు నిండుతుండగా కూతుర్ని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో చేర్పించింది దుర్గ. గంగ రోజూ శ్రద్ధగా బడికి వెళ్లటం, బుద్ధిగా చదవమన్నది చదవటం చూచి దుర్గకు ఎనలేని సంతోషం కలుగుతున్నది. తన బొందిలో ప్రాణమున్నంత వరకు బిడ్డ భవిష్యత్తు కోసం చేయగలిగినంత చెయ్యాలనుకొని పైసపైస కూడబెట్ట సాగింది.

హఠాత్తుగా పిచ్చయ్య రోగంతో మంచానపడ్డాడు. లివర్ క్యాన్సరన్నారు. నెలరోజులు తిరగకుండానే కన్నుమూశాడు. ఇంటికి పెద్దదిక్కుగా వుండే మనిషి చనిపోవటంతో కుటుంబ పరిస్థితులు తారుమారయ్యాయి. సూర్యం చేతికి ఇంటి పెత్తనం వచ్చింది. వదిన సుజాత ప్రవర్తనలో కూడా మార్పు కనబడసాగింది. గంగను తన పిల్లలతో కలవకుండా దూరం పెడ్తున్నది. ఇంట్లో దుర్గ, గంగలు వాడే వస్తువులు, అన్నం తినే కంచాలు, నీళ్ల గ్లాసులు మొదలైన వస్తువులన్నీ విడిగా వుంచమని వివక్ష చూపటం మొదలెట్టింది. నిందలు, నిష్ఠూరాలు, సూటిపోటీ మాటలు ఎక్కువయ్యాయి.

"సుజాతమ్మా! ఒకర్నొకరు తాకినా, కలసిమెలసి బ్రతుకుతున్నా, కంచాలను కలిసి వాడుకున్నా, దుస్తులు కలగలిపి వాడుతున్నా, మరుగుదొడ్లు ఉపయోగించినా ఈ వ్యాధి అంత తేలిగ్గా ఇతరులకు సోకదు. నిర్భయంగా కలసి వుండొచ్చు" అంటూ కుమారి ఇంటికి వచ్చినప్పుడల్లా అందరికీ వివరంగా చెప్పింది. అయినా ఇంత మూర్ఖంగా అన్నా, వదినలు ప్రవర్తించటం దుర్గకూ, కాంతమ్మకూ మింగుడు పడటం లేదు.

తన కూతురు బడిలో చేరిందని తెలిసి మహదానంద పడ్డాడు నాసరయ్య. పసికందుగా చూడటమే గాని మళ్లీ చూడ్లేకపోయాడు. బిడ్డను చూడాలన్న కోరిక అదుపుచేసుకోలేక ఒకరోజు ఏకంగా స్కూలు దగ్గరకు వెళ్లాడు. ఔటుబెల్లు కొట్టేదాక కాచుక్కూచున్నాడు. తోటి పిల్లల్ని అడిగి కూతురెవరనేది తెల్సుకున్నాడు.

కూతురు బయటకు వస్తూనే, " అమ్మా! గంగా!" అంటూ చేతుల్లోకి తీసుకున్నాడు.

"నా పేరు నీకెట్టా తెలుసు? ఎవరు నువ్వు?" అడిగింది పరిశీలనగా చూస్తూ.

తల్లి పోలికలతో చురుగ్గా, అందంగా, బొమ్మలా వున్న కూతుర్ని చూస్తూ ఆనందంతో మురిసిపొయ్యాడు. "నా వాళ్లకు నేనంటూ చెప్పుకోలేని దౌర్భాగ్యుణ్ణి తల్లీ! ఊరూ పేరూ లేనోణ్ణి" అంటుంటే నాసరయ్య కళ్లు సజలమైనాయి.

"మీ అమ్మ బాగుందా?" అడిగాడు.

"ఓ! నీకూ తెలుసేంటి అమ్మ"? అడిగింది ఆశ్చర్యంగా.

"ఊఁ! తెలుసమ్మా! నువ్వు పుట్టకముందు నుంచీ తెలుసు. మీ అమ్మంటే నా కెంతో ఇష్టం కూడా!" అంటూ గంగ లేత అరచేతుల్ని చెంపలకు అద్దుకుని, ఆనక ముద్దులు కురిపించాడు.

బడిగంట మోగింది. గంగ నాసరయ్య చేతుల్లోంచి వదిలించు కొంటూ, "బెల్లు కొత్తారు. పోవాలి" అంటూ పరిగెత్తబోయింది.

బిస్కట్టు ప్యాకెట్ కూతురి చేతిలో వుంచి, "నీ కోసం తెచ్చాను. తినమ్మా" అంటూ ప్రేమగా తల నిమిరాడు.

"బిస్కత్తు ఎవరిచ్చారని అమ్మకు చెప్పాలి?" ఆరిందాలా అడిగింది.

"ఎవరో ఒక చెడ్డ నాన్నని చెప్పు" అంటూ గబగబా రోడ్డు మీదకి వెళ్లిపోయాడు నాసరయ్య.

స్కూలు బ్యాగ్‌లో బిస్కట్లు చూస్తూనే దుర్గ కూతుర్ని ఎక్కడివని అడిగింది. ఇంచుమించు తండ్రన్నమాటలు గంగ తల్లికి అప్పజెప్పగలిగింది. ఆలోచించిన మీదట భర్త అయివుంటాడన్న స్ఫురణ దుర్గకు కలిగింది.

ఆసుపత్రిలో గంగను ప్రసవించాక కనబడిన భర్త, ఇప్పటి దాకా తన కంటబడి ఎరగడు. పెళ్లయ్యాక మూడేళ్ల కాపురంలో భర్త ఏనాడూ తన మనసు నొప్పించలేదు. ఎంతో ప్రేమగా చూసుకునేవాడు. అత్తమామలు కూడా తనను కోడలిగా కాక కూతురిలానే ఆదరించారు. పెళ్లిళ్లు, పేరంటాలని రెండుమూడు రోజులు పుట్టింటి కొచ్చి వుండాల్సొస్తే వదిలిపెట్టి వుండలేకపోయేవాడు. ఏదోరకంగా తనను సంతోషపెట్టాలని చూసేవాడు. ఇరుగు పొరుగు కాపురాల్లో కీచులాటలు, కొట్లాటలు గమనిస్తూ ఈ విషయంలో తనెంతో అదృష్టవంతురాల్నని మురిసిపోయేది. ఊహించని

పరిణామం ఈ రోగం. ఇద్దర్నీ విడదీసింది. భర్తతో తెగతెంపులు చేసుకోవటమనేది అతనికి తను వేసిన శిక్షా? లేక తనకు తాను విధించుకొన్న శిక్షా? భర్త జ్ఞాపకాలతో ఆ రాత్రంతా దుర్గకు నిద్ర కరువైంది.

◈ ◈ ◈

నానబెట్టిన మినప్పప్పు కడిగి వుంచమని కాంతమ్మకు పురమాయించి పని మీద బయటికెళ్లింది సుజాత. ఒంట్లో నలతగా వుండటంతో ఆ పని దుర్గకు అప్పగించింది కాంతమ్మ. చేతిలో కుట్టుపని కాసేపు ప్రక్కన బెట్టి పప్పు కడగసాగింది దుర్గ.

సుజాత ఇంటి కొచ్చేసరికి దుర్గ పప్పుకడుగుతూ కనిపించింది. చేతిలో వున్న పప్పు గిన్నె లాగేసుకొంది. "చెయ్య గలిగితే చెప్పింది చెయ్యాలి. లేకుంటే చెయ్యలేనని చెప్పేడవాలి. అంతేగాని దిక్కుమాలిన వాళ్లకు పురమాయింపులేంటి?" అంటూ రంకెలేస్తూ పప్పు మురుగుగుంటలోకి వంపేసింది.

"అయ్యో! అదేంపనే! అలా పారబోస్తావేం?" అంటూ కాంతమ్మ నెత్తీనోరు కొట్టుకొంది.

"మాయదారి రోగాలున్న వాళ్ల చేతులు పడ్తే మేమూ ఆ రోగాలు తగులుకొని అర్ధంతరంగా చస్తాం. పెట్టిందేదో తింటూ ఒక మూల పడుండండి. ఇష్టం లేకపోతే దయచెయ్యండి" అంటూ అరిచి గోలగోల చేసింది.

ఇంట్లో రాను రాను ఇలాంటి అవమానాలు, ఛీత్కారాలు భరించటం కష్టంగా వుంది దుర్గకు. పొమ్మనకుండా పొగబెట్టడంలా వుంది పరిస్థితి. సూర్యం ఇవన్నీ గమనిస్తూ కూడా తనకేం పట్టనట్లు వ్యవహరిస్తున్నాడు. మొగుడూ పెళ్లాలు కూడబలుక్కొనే చేస్తునట్లుంది. అటు తల్లన్నా లెక్కలేనట్టు ప్రవర్తిస్తున్నారు. ఏం చెయ్యాలో దుర్గకు పాలు బోవటం లేదు.

ఒకరోజు మధ్యాహ్నం దుర్గ అత్తమామలు ఇంటికొచ్చారు. ఈ నాలుగేళ్ల కాలంలో ఇదే వాళ్లు ఇంటి ముఖం చూడటం. రాక రాక ఇంత కాలానికి వచ్చారంటే ఏదో రాయబారానికి వచ్చారనే అనుకొంది కాంతమ్మ.

"అమ్మా! ఇంతకాలం మాకు మొఖం చెల్లకే రాలేకపోయాం. జరిగిందానికి వాడెంత కుమిలిపోతా వున్నాడో కన్నోళ్లం మాకు తెలుసు. తప్పొప్పులు ఎంచటాకి రాలేదిప్పుడు" తిరుపతయ్య మెల్లగా ఉపోద్ఘాతం మొదలెట్టాడు.

"బంగారం లాంటి నా కూతురి బతుకు ఇట్టా రాసి పెట్టాడు. అయినోళ్లు, కానోళ్లు బిడ్డను ఎన్ని రకాలుగా అవమానిస్తన్నారో ఈ నోటితో చెప్పలేను" గొల్లుమంది కాంతమ్మ.

దుర్గ తల్లిని వారించింది. గతాన్ని తవ్వుకోవటం, నిందలు మోపుకోవటం వల్ల వచ్చే ప్రయోజనం మాత్రం ఏముంది? జరగాల్సిన నష్టం ఎటూ జరిగిపోయింది. దాన్ని భర్తీ చేసుకోగల మార్గం ఏముందనేది పెద్ద ప్రశ్న?

"అమ్మా దుర్గా! ఒంట్లో ఎట్టున్నా ఈ నాలుగేళ్లు వాడూ పనికి నాగా పెట్టకుండా చాకిరీ చేశాడు. యాభైవేలు కూడబెట్ట గలిగాడు. ఆ డబ్బంతా కూతురి పేర పోస్టాఫీసులో డిపాజిట్ చేశాడు. ఈ కాగితాలు నీకిమ్మని పంపాడమ్మా" సంచిలోంచి డిపాజిట్ సర్టిఫికేట్స్ బయటకు తీశాడు.

"మనిషినే కాదనుకొన్నాక ఏ ముఖం పెట్టుకొని ఆయన సంపాదనకు ఆశపడగలం. నలుగురూ నవ్వరా మామయ్యా!" బాధగా అడిగింది దుర్గ.

"అమ్మాయ్! వాణ్ణి నువ్వు కాదనొచ్చు, వాడు నిన్ను కాదనొచ్చు. కాని అభంశుభం తెలీని ఆ పసిదాన్ని మీ కూతురు కాదని ఎలా అనుకొంటారమ్మా! రేపు మీ కేదన్నా అయితే ఈ బిడ్డ గతేంది? మనుషుల అండ లేకా అవసరానికి చేతిలో డబ్బూ లేకా ఆ పిల్ల ఏమయిపోతుందమ్మా! మేమూ కాటికి కాళ్లు బారజాపుకున్నోళ్లమే" కంటతడి అద్దుకున్నాడు తిరుపతయ్య.

తిరుపతయ్య మాటల్లో నూటికి నూరు శాతం సత్యం వుందనిపించింది దుర్గకు. ఆవేశం కన్నా ఆలోచన ముఖ్యమనిపించింది. భర్త దూరాలోచనకు లోలోన సంతోషించకుండా వుండలేకపోయింది.

"మీ ఇష్టం మామయ్య! అలాగే కానీయండి" అంటూ తిరుపతయ్య చేతిలో నుండి కాగితాలు అందుకుంది.

ఈ లోగా బడికెళ్లి కాంతమ్మ గబగబా మనవరాల్ని చంకనేసుకొచ్చింది. గంగను చూస్తూనే ముసలాళ్లిద్దరూ సంబరపడిపోయారు. నాయనమ్మ, తాతయ్యలు దగ్గరకు తీసుకొని ప్రేమగా ముద్దులాడుతుంటే సిగ్గూ, బిడియంతో బిర్రబిగుసుకు పోయింది.

"డ్యూటీ లేనప్పుడల్లా కూతుర్ని చూచుకోటానికి ఈ వూరు బడికాడికి వస్తున్నాడంటమ్మా పిచ్చోడు. అందుకేం అడ్డు చెప్పకండమ్మా!" అంటూ ప్రాథేయపూర్వకంగా వేడుకున్నాడు తిరుపతయ్య.

అందుకెవరూ అభ్యంతరం చెప్పలేకపోయారు. కాసేపుండి ముసలాళ్లిద్దరూ బయల్దేరారు. "అమ్మా దుర్గా! నా కొడుకు చెడ్డపని చేసుండొచ్చు గానమ్మా, చెడ్డోడు మాత్రం కాదు" అంటూ కోడలి చేతులు పట్టుకొన్నాడు క్షమాపణ వేడుకొంటున్నట్లుగా తిరుపతయ్య.

ఆ మాటలు దుర్గ మనసులో బలంగా నాటుకుపోయాయి.

◆ ◆ ◆

దుర్గ అత్తింటివాళ్లొచ్చి వెళ్లినట్టు, ఎంతో కొంత డబ్బు ముట్టజెప్పినట్టు పసిగట్టారు అన్నా వదినలు. అందులోంచి కొంత రాబట్టాలని కస్సుబుస్సులు మాని, ప్రేమ ఒలకబొయ్యటం మొదలెట్టారు. వాళ్ల పన్నాగం దుర్గకు గాని, కాంతమ్మకు గాని ఒక పట్టాన అర్థం కాలేదు.

"దుర్గా! అడగటానికి మీ అన్నయ్యకు నోరు రావటం లేదు. నీ పెళ్ళి దగ్గర్నుంచి మీ నాయన చావు దాకా కుటుంబ భారమంతా తనొక చెయ్యివేసి లాక్కొచ్చిన సంగతి నీకూ తెలుసుగదా! చిట్టీలతో, చిల్లర మల్లర బాకీలతో కాళ్లూ చేతులాడటం లేదు. కాస్తో, కూస్తో నువ్వు సాయం జేస్తే నిదానంగా సర్దుబాటు చేస్తానంటున్నాడు" లయగా వల విసిరింది సుజాత.

మొగుడూ పెళ్లాలిద్దరూ పచ్చి అబద్ధాలు ఆడుతున్నారన్న విషయం కాంతమ్మకూ తెలుసు, దుర్గకూ తెలుసు. నెలకో ఐదువందలు పిల్లపేర పోస్టల్ ఆర్.డి. వెయ్యటం మినహా తన సంపాదనంతా కుటుంబంకోసమే వినియోగిస్తున్నది దుర్గ. కూతురి పెళ్లికి పిచ్చయ్య తగు జాగ్రత్తలోనే వున్నాడు. పిచ్చయ్య చనిపోయాక కాంతమ్మ తోడబుట్టిన అన్నదమ్ములు తలో చెయ్యివేశారు. వాళ్లతో వాదోపవాదాలు అనవసరమనుకొన్నారు.

"వదినా! పిల్ల పేర పోస్టాఫీసులో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసి కాగితాలు ఇచ్చారు. అంతేగాని డబ్బివ్వలేదు. ఉప్పునీ, పప్పునీ నాకు చేతనైన సాయం నేనూ చేస్తూనే వున్నాను" అంటూ వున్న విషయం వున్నట్లుగా చెప్పింది దుర్గ.

తమ ఎత్తుగడ ఫలించనందుకు సూర్యం, సుజాతలిద్దరూ లోలోపల రగిలిపోసాగారు. నిజ స్వరూపం బయటపడింది. ఎల్లి మీద పిల్లి మీద పెట్టి తిట్టటాలు, శాపనార్థాలు పెట్టటం మళ్లీ మొదలైంది. దిక్కుతోచని స్థితిలో అణిగిమణిగి పడుంటున్నారు తల్లీ కూతుళ్లిద్దరూ. ఇలా ఎంతకాలం?

◆ ◆ ◆

దుర్గ కుట్టుదారాలు తెచ్చుకోవటానికి బజారు కెళ్లింది. అదే సమయంలో గంగ బడి నుంచి మంచి ఆకలిమీద వచ్చింది. ఇంటికొచ్చేసరికి తల్లి కనబడలేదు. అమ్మమ్మ పొయ్యిలోకి పుల్లలు పగలేస్తూ కనిపించింది. ఉదయం అత్త వడ్డించిన పరవాన్నం గిన్నె కంటబడింది. అదంటే ఎంతో ఇష్టం గంగకు. గిన్నెలో చేతులు పెట్టి ఆబగా దేవుకుని తినసాగింది. ఎటు నుంచి వచ్చిందో సరోజ వస్తూనే గంగమీద రాక్షసిలా విరుచుకుపడింది. చిన్నపిల్లని కూడా చూడకుండా ఎడాపెడా చావబాదింది. ఆరీ ఆరని పొయ్యిలోంచి కట్టెపేడులాగి చేతిమీద వాత పెట్టింది.

దుర్గ ఇంటికొస్తూనే గోలగా ఏడుస్తున్న కూతుర్ని చూచి గుండె చెరువైంది. వంటి మీద దెబ్బలకు ఎర్రగా కందిన శరీరం, చేతి మీద వాత చూచి తల్లి ప్రాణం విలవిల్లాడింది. బిడ్డను ఒడిలోకి తీసుకొని నిస్సహాయంగా ఏడ్వసాగింది.

"వదినా! నేనంటే మీకు కోపం, అసహ్యం వుంటే నన్ను సాధించండి. అన్నెంపున్నెం ఎరగని నా కూతుర్నెందుకు కాల్చుకుతింటారు?" అంటూ నిలదీసింది.

"నీకున్న మాయరోగం నీ కూతురికి లేదనెక్కడుంది? దానెంగిలితో మాకు రోగాలంటుకొని చావాలనిగాపోతే శుచీ శుభ్రం వుండక్కర్లా. అంత రోషగత్తెవి, పుట్టిల్లే గతని పడుండటం దేనికి?" అంటూ ఎదురు దాడికి దిగింది సుజాత.

ఇంటికొచ్చిన సూర్యం కూడా భార్యకు వత్తాసు వచ్చాడు. కాంతమ్మ ఎటూ చెప్పలేని సంకట స్థితిలో పడిపోయింది.

"కష్టంలో పుట్టింటి వాళ్లు ఆదరిస్తారని, చచ్చేటప్పుడు గొంతులో ఇన్ని తులసినీళ్లు పోస్తారని ఇంతకాలం ఇక్కడ పడున్నాను. నన్నూ నా బిడ్డను విషప్పురుగుల్లా చూస్తున్నారు. నా భర్త తెలియక తప్పు జేస్తే, మీరు తెలిసీ కావాలని చేస్తున్నారు. నా భర్త తెచ్చిపెట్టిన రోగం వల్ల ఎప్పుడో ఒక్కసారే చస్తాను; కాని మీరు రోజుకోసారి నన్ను చంపుతున్నారు. మీకన్నా నా భర్తే నయమనిపించాడు" అన్నది దుర్గ ఉక్రోషంగా.

"ఏంటీ! నీకు దిక్కుమాలిన రోగం అంటించిన ఆ కసాయి మొగుడు, మా కన్నా మంచోడయ్యాడా?" అంటూ మండిపడ్డాడు సూర్యం.

"కట్న కానుకలు తేలేదని పెళ్లాలను నిలువునా చంపే మగాళ్లకన్నా కసాయోడా నా మొగుడు? అనుమానంతో భార్యల గొంతు కోసే మగాళ్లకన్నా కసాయోడా నా మొగుడు? తాగుడి కోసం పెళ్లాం బిడ్డల్ని వీధులపాలు జేసే మగాళ్ల

కన్నా కసాయోడా నా మొగుడు? క్షణికోద్రేకంలో ఒక తప్పు చేశాడు నా భర్త. అందుకతను కుమిలి పోతున్నాడు. ఇలా అవమానాలతో ఇక్కడ నేనూ, అక్కడ నా భర్తా ఎవరి చావు వాళ్లు చావటం కన్నా, కష్టమో సుఖమో కలిసి పంచుకొంటూ బతకగలిగినన్నాళ్లు బ్రతుకుతాం. చావుకు ఎదురీదుతాం. ఇక మీ దయాదాక్షిణ్యాలు నాకు అక్కరలేదు" అంటూ ఆవేశంగా దుర్గ తన బట్టలు, సామాను సర్దేసుకొని ప్రయాణానికి సిద్ధమైంది.

"దుర్గా! తొందర పడుతున్నావేమో కాస్త ఆలోచించుకోమ్మా!" అంటూ వారించబోయింది కాంతమ్మ.

"అమ్మా! ఎన్నో రకాల క్రిమి కీటకాలు మనిషిని పట్టి ప్రాణాంతకమైన రోగాల్ని కలిగిస్తాయి. అట్టాంటి రోగాల బారినపడే దురదృష్టవంతుల పట్ల ఆదరణ, ప్రేమాభిమానాలు చూపలేని మనుషులు ఆ క్రిమి కీటకాల కన్నా హీనమైన వాళ్లు! మా అత్తమామలు నన్నూ, నా బిడ్డను చేరదీస్తారన్న నమ్మకం నాకుంది. నా భర్తా చెడ్డవాడు మాత్రం కాదు" అంటూ గంగను చంకనెత్తుకొని, సామానుతో బయటకు నడిచింది దుర్గ.

డ్యూటీ దిగి నేరుగా ఇంటికొచ్చిన నాసరయ్య, ఇంటి ముంగిట తల్లిదండ్రులతో ఆటలాడుతున్న కూతుర్ని, ముసి ముసి నవ్వులు నవ్వుతున్న దుర్గను చూస్తూనే, జీవితమనే లోగిలికి క్రొత్త వాకిళ్లు తెరుచుకున్నట్లుగా ఆనందంతో ఉబ్బితబ్బిబ్బయ్యాడు.

❄

*(ఆగస్టు 1999, ఆకాశవాణి విజయవాడ కేంద్రం నుండి ప్రసారమైన నా నాటకానికి కథారూపం)*